

కథా నిలయం

# ముంపు

బి.పి. కరుణాకర్

ఇంటి ముందు సైకిలు ఆపి దిగాడు సూరి. సైకిలు గోడకు ఆనించి, క్యారియర్‌కు ఉన్న పుస్తకాలు అందుకుంటూ చేతిగడియారం వంక చూసుకున్నాడు. ఆరూ ఇరవయి అయిదయింది. ట్యూషన్‌కు వెళ్ళి వుంటే తను తిరిగి ఇంటికి చేరుకునేసరికి ఎనిమిదిన్నర అవుతుంటుంది. ఆవేళ తల నొప్పిగా ఉన్నందువలన ట్యూషన్‌కు వెళ్ళలేదు. కాలేజీ అయిపోయాక గంటసేపు ప్లే గ్రవుండ్‌లో వాలీబాల్ మేచ్ జరుగుతుంటే చూస్తూండిపోయాడు.

కాంపౌండ్ గేటు నెట్టుకుని లోపలకు వచ్చాడు సూరి. అతని పిన్ని శారద అయిదున్నరకే

ఆఫీసునుండి వచ్చేస్తుంటుంది. వీధి తలుపువేసి ఉంది. సూరి మెట్లు ఎక్కి తలుపు నెట్టాడు. లోపల గడియపెట్టి ఉంది. తలుపు తట్టబోయి ఆగాడు. కొన్నిసార్లు శారద ఆఫీసునుండి తిరిగి వచ్చాక ఒక గంటా, గంటన్నరపాటు నిద్రపోవటంకద్దు. శారద నిద్రపోతున్నప్పుడు సూరి డిస్టర్బ్ చేయడు. ఆ మాటకొస్తే శారదకు కోపం తెప్పించే పనులు సూరి చేయడు. శారద సూరికోసం ఎంతో చేసింది. ఆమెగనుక అతనిని ఆదుకుని వుండకపోయి వుంటే తనేమయి వుండేవాడో ఆలోచించటానికి సూరికి భయం వేస్తుంటుంది.

తలుపు లోపలి గడియను బయటినుండి తీయటం సూరికి తెలుసు. జేబులోంచి బాల్ పెన్ తీశాడు. బాల్ పెన్‌ను తలుపు సందులోకి నెట్టి పయికి లాగాడు. గడియ వచ్చేసింది. బాల్ పెన్ తిరిగి జేబులో పెట్టుకుని తలుపు నెట్టాడు. చప్పుడు కాకుండా తలుపు తెరుచుకుంది. తలుపు మూసి గడియ పెట్టాడు. పుస్తకాలు బీరువాలో పెటబోతూ ఆగాడు. బీరువా ప్రక్కన గోడవారగా వున్న నలుపు రంగు జోళ్ళమీద అతని దృష్టి నిలిచింది. ఆ జోళ్ళు ఎవరివో సూరికి తెలుసు. నారాయణ హైదరాబాద్ నుండి వచ్చి వుంటాడు. అనుకున్నాడు. 'పిన్ని, నారాయణ పడకగదిలో వుండి వుంటారు' అని కూడా అనుకుని పడకగదివైపు చూశాడు. పడకగది తలుపు దగ్గరగా వేసి వుంది. లోపల లైటు వెలుగుతోంది. ఫేన్ తిరుగుతున్న చప్పుడు వినిపిస్తోంది.

సూరి పుస్తకాలు బీరువాలో పెట్టి కుర్చీలో కూర్చుని జేబులోంచి రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. సాయం కాలపు ఎండ పల్చబడుతోంది. నారాయణ ఇక్కడికి రావటం సూరికి ఇష్టం లేదన్నసంగతి శారదకు తెలుసు. నెలరోజుల క్రిందటే నారాయణ ఇక్కడకు వచ్చి నాలుగు రోజులు వుండి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయే రోజున నారాయణ, శారదలమధ్య చిన్న సయిజు పోట్లాట జరిగింది. ఆ పోట్లాటకు కారణం శారదను సూరి అడగలేదు. శారద చెప్పలేదు. శారద స్వవిషయాల్లో సూరి ఎప్పుడూ జోక్యంకలిగించుకోలేదు. శారద ఏదయినా చేయదలిస్తే ఎన్ని అవాంతరాలు వచ్చినా చేసి తీరుతుంది. ఈ విషయం సూరికి తెలుసు. సూరి తండ్రికి కూడా శారద బలహీనతలు తెలుసు. సూరి

తల్లి చనిపోయేనాటికి సూరి వయసు ఎనిమిది సంవత్సరాలు. రెండేళ్ళు గడిచాక సూరి తండ్రి శారదను పెళ్ళి చేసుకున్నాడు. సూరి తండ్రి చనిపోయి ఏడు సంవత్సరాలు దాటాయి. ఇప్పుడు శారద వయసు ముప్ఫయి అయిదు సంవత్సరాలు.

* * *

రెండు సంవత్సరాల క్రిందట శారదతో సూరి, ఆమె బాబాయి కూతురు పెళ్ళికి హైదరాబాద్ వెళ్ళినప్పుడు సూరి నారాయణను మొట్ట మొదటిసారిగా చూశాడు. అతను శారద బాబాయికి దగ్గిర చుట్టం అవుతాడు. ముప్ఫయి సంవత్సరాల వయసు వుంటుంది. కాని చూడటానికి ఇరవయిఅయిదు సంవత్సరాల మనిషిలా వుంటాడు. పొడుగ్గా, ఎర్రగా వుంటాడు. అంత లావూ కాదు, సన్నం కాదు. అతను శారదతో చనువుగా వుండటం గమనించి, "ఆయన నాకేమి అవుతాడు పిన్నీ?" అడిగాడు సూరి.

శారద వెంటనే జవాబు చెప్ప లేదు. నారాయణ ముఖంలోకి రెండు క్షణాలు పరీక్షగా చూసి నవ్వి, "ఆయన్నే అడుగు" అంది.

సూరి నారాయణ వంక తిరిగి, "మీరునాకుఏమవుతారు?" అడిగాడు.

నారాయణ చుట్టూ ఒకసారి చూసి, "బాబాయిని" అన్నాడు. అని శారద ముఖంలోకి చూసి, "కాదా?" అడిగాడు.

"ఆఁ" అని శారదా పయిట భుజాలనిండా కప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఎందుచేతనో నారాయణను 'బాబాయి' అని పిలవాలనిపించ లేదు సూరికి.

పెళ్ళి అయిన రాత్రి భోజనాలు ముగించే సరికి తొమ్మిదిన్నర దాటింది. నారాయణ, శారద దగ్గిరకు వచ్చి, "మీకు మేడమీది గదిలో పడక ఏర్పాటు చేశాను. మీ ఇద్దరూ పయికి వెళ్ళి పడు కోండి. లేకపోతే మరెవరయినా ఆ గదిని ఆక్రమించుకుంటారు" అన్నాడు.

శారద నారాయణను ఏదో అడగబోయి సూరిని చూసి ఆగింది. అడగలేదు. సూరి వంక చూసి, "సూరీ! నువ్వు పయికి వెళ్ళి పడుకో. కొద్ది సేపట్లో నేను వస్తాను" అంది.

సూరి తలూపి మేడ మీది గదికి చేరుకున్నాడు. గది చిన్న దయినా శుభ్రంగా ఉంది. రెండు పరుపులు పరిచి ఉన్నాయి. బల్ల మీద టేబుల్ ఫేన్ ఉంది. టేబుల్

ఫేన్ ఆన్ చేసి లయిటు ఆర్పివేసి పరుపుమీద పడుకున్నాడు. తెరిచి ఉన్న కిటికీ లోంచి వెన్నెల వెలుగు పొడుగ్గా పడుతోంది. కళ్ళు మూసుకున్నాడు. రెండు నిమిషాల తర్వాత నిద్రలోకి జారిపోయాడు.

గంట తర్వాత, సూరికి దాహం వేసి మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచాడు. వెన్నెల వెలుగు పల్చబడింది. రెండవ పరుపు వంక చూశాడు. పరుపు గోడ చివరంటా జరిగివుంది. తలుపు వేసి ఉంది. రెండు పరుపుల మధ్య ఉన్న ఫేన్ అటు తిరిగి ఉంది. సూరి లేచి కూర్చుందా మనుకున్నాడు. పరుపు మీద దృశ్యం చూశాక అతనికి కదల బుద్ధి కాలేదు. హృదయం వేగంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది. లేచి కూర్చుని, బాధతో- అరుద్దామన్నంత కోపం వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే కళ్ళు మూసుకున్నాడు. మనసు మవునంగా రోధిస్తుంటే, బాధా జోలలో నిద్ర పట్టింది.

మరుసటి రోజు తెలతెల్లవారుతుండగా శారద తట్టి లేపుతుంటే సూరికి మెలకువ వచ్చింది. లేచి కూర్చున్నాడు. శారద తలస్నానం చేసి కొత్త చీర కట్టుకుని ఉంది.

"ఎనిమిది గంటలకు మన ఊరు వెళ్ళేందుకు బస్సు ఉంది..." అంది.

ఈ మాటలతో సూరి బద్ధకం వదిలింది. శారద ముఖంలోకి పరీక్షగా చూశాడు. ఆమె కుడి బుగ్గ మీద పళ్ళ గాటు స్పష్టంగా కనిపిస్తోంది. 'రాత్రి తనంతా చూసిన సంగతి ఈవిడకు తెలిస్తే ఏమనుకుంటుంది' అని ప్రశ్నించుకున్నాడు.

"సూరీ! ఏమిటలా చూస్తున్నావ్? నిద్ర మత్తు వదలలేదా?" అడిగింది శారద.

ఏమీ లేదన్నట్లు సూరి తల అడ్డంగా ఆడించాడు.

"లే, త్వరగా తెములు. నేను తయారుగా ఉన్నాను .... నీదే ఆలస్యం."

"హైదరాబాద్ లో చార్మినార్ గోల్కొండ, మ్యూజియం చూపిస్తానన్నావు కదా పిన్నీ!" ప్రాధేయ పూర్వకంగా అడిగాడు సూరి.

"అవన్నీ ఈసారి వచ్చినప్పుడు చూద్దాంలే."

సరే అన్నట్లు తలూపి లేచి నిలబడ్డాడు సూరి.

శారద, సూరి, గౌలిగూడా బస్ డిపోకు చేరుకునేసరికి ఏడు యాభై అయింది. ఎనిమిది పదికి

వాళ్ళూరు వెళ్ళే బస్ వచ్చింది. ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు. ఐదు నిమిషాల తర్వాత కండక్టర్ వచ్చాడు. టిక్కెట్లు ఇవ్వబోతుండగా నారాయణ బస్సులోకి వచ్చాడు.

నారాయణ హఠాత్ ఆగమనానికి సూరి ఆశ్చర్యపోయాడు. "ఏమిటి మీరిలా వచ్చారు?" అడిగింది శారద.

"మా స్నేహితుడొకడు విజయవాడ వెళ్ళుతుంటే బస్సెక్కిద్దామని వచ్చి ఎక్కించాను. ఆ బస్ ఇప్పుడే వెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ మీ ఊరు బస్కదా అని తొంగిచూస్తే మీరు కనిపించారు. ఇవేళ వెళ్ళిపోతున్నట్లు నిన్న మీరు మాటవరసకైనా అనలేదే" నిష్ఠూరంగా అని సూరివేపు తిరిగి "వాట్ సూరీ మా వూళ్ళో చార్మినార్, గోల్కొండగట్రా చూడకుండానే వెళ్ళిపోతున్నావ్" అన్నాడు.

సూరి సన్నగా నవ్వి ఊరుకున్నాడు.

"మీకు మా ఊళ్ళో చూడవలసిన ప్రదేశాలు చూడాలని లేదా?" అడిగాడు నారాయణ.

"అన్నీ నేను లోగడే చూశాను" అంది శారద.

నారాయణ సూరి కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ "నువ్వో?" అడిగాడు.

సూరి తల అడ్డంగా అడించాడు.

"చూడాలని లేదా?"

సూరి జవాబు చెప్పలేదు. శారదవంక చూశాడు.

"నీకు చూడాలని వుందా?" అడిగింది.

సూరి తలూపాడు.

"నేను రెండు మూడు రోజులు సెలవు పొడిగించాలి" అంది శారద నెమ్మదిగా.

"సూరికోసం మీరు సెలవు పెట్టక తప్పదు. ఇంకో విషయం ఇప్పుడు మీరు తిరిగి మీ బాబాయి ఇంటికి వెళ్ళటం లేదు; మా ఇంటికి వస్తున్నారు. మీరు వుండబోయే ఆ రెండు మూడు రోజులూ మా ఇంట్లోనే గడపబోతున్నారు, సరేనా?"

శారద సూరి ముఖంలోకి చూసింది. ఆవిడ ఏమని జవాబు చెబుతుందా అని సూరి ఆతృతగా ఎదురుచూస్తున్నాడు.

"సూరి ఇష్టమే నా ఇష్టం" అంది శారద.

"నాకు ఎటువంటి అభ్యంతరం లేదు" అన్నాడు సూరి.

"వెరీగుడ్! మనం ఈ బస్ ఎంత త్వరగా దిగితే అంత మంచిది. కండక్టర్ మన దగ్గరకు వచ్చేస్తున్నాడు" అన్నాడు నారాయణ.

ముగ్గురూ బస్ దిగి డిపో బయటకు వచ్చారు. నారాయణ సైదాపేట కాలనీకి ఆటోరిక్షా మాట్లాడాడు. ముగ్గురూ రిక్షా ఎక్కారు. ఒక్క కుదుపుతో రిక్షా ముందుకు కదిలింది. రెండు నిముషాలయ్యాక నారాయణ ఆమెకు దగ్గరగా జరుగుతూ సూరివంక చూసాడు. సూరి దృష్టి రోడ్డుమీద వుంది. పయిటతో అతని చేతిని కప్పుతూ "ఆత్రం" అంది శారద నవ్వుతూ.

ఇరవై నిమిషాలతర్వాత ఆటోరిక్షా నారాయణ ఇంటిముందు ఆగింది. నారాయణ మీటర్ చూసి డబ్బులు ఇచ్చి రిక్షా దిగాడు. అతని వెనకే శారద దిగి పైటతో భుజాలు నిండుగా కప్పుకుంది. సూరి పెట్టె తీసుకుని దిగాడు. ఆటోరిక్షా ఎదుటి సందులోకి వెళ్ళిపోయింది.

నారాయణ ఇంటి తలుపు తాళం తీస్తుంటే "ఈయనకు పెళ్ళికాలేదా?" అడిగాడు సూరి చిన్నగా

"అయింది. భార్య ఇక్కడ వుండటం లేదు. పుట్టింట్లో వుంటోంది."

"పిల్లలు లేరా?"

"లేరు."

"ఈయన ఏం చేస్తుంటాడు?"

"ఏదో ప్రయివేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు" అంది శారద.

నారాయణ తలుపు తాళం తీసి తలుపు బార్లాతెరచి లోపలకు నడిచాడు. వాళ్ళిద్దరూ అతన్ని అనుసరించారు.

సూరి పెట్టె సోఫా ప్రక్కనే పెట్టి గదిని పరికించి చూశాడు. ఎక్కడి వస్తువులు అక్కడ అస్తవ్యస్థంగా వున్నాయి. టీపాయ్‌మీద పత్రికలు పడివున్నాయి. సోఫాలో కూర్చుని పడకగదిలోకి చూశాడు. పడకగదీ అలానే వుంది.

"రండి. మా ఇల్లు చూద్దురు" అంటూ నారాయణ లోపలికి దారితీశాడు. శారద లోపలకు నడిచింది. టీపాయ్ మీదున్న చిన్నపిల్లల పత్రికలు చూశాక సూరికి లోపలికెళ్ళా లనిపించ లేదు. ముందుకు ఒంగి పత్రికలు అందుకొని తిరగవేయసాగాడు.

ఇరవై నిముషాలు గడిచాక చూస్తున్న పుస్తకం మూసి పడకగదిలోకి తొంగి చూసాడు.

పడక గది నిశ్శబ్దంగా ఉంది. చేతిలోని పుస్తకాన్ని టీపాయ్‌మీదపెట్టి లేచి నిలబడి పడక గదిలోకి వచ్చాడు. గదిలో-ఎవరూ లేరు. మంచంమీద నారాయణ ఉడుపులు మటుకు కనిపించాయి. వంటగదిలోకి చూశాడు. వంటగది ఖాళీగా ఉంది. వెనక్కి తిరిగబోయి ఆగి స్నానాల గదివంక చూశాడు. స్నానాల గదికి తలుపులేదు. నారాయణ స్టూలుమీద కూర్చుని ఉన్నాడు. అతని ఒంటిమీద చిన్న తువ్వాలు మటుకు ఉంది. శారద అతని వీపుకు సబ్బు రాస్తోంది ఆమె ఒంటిమీద రవిక, లంగా మటుకు ఉన్నాయి. బయటి దండెం మీద చీర జీరాడుతోంది.

హైదరాబాద్‌లో రెండు మూడు రోజులు మాత్రమే ఉందా మనుకున్న శారద ఉద్దేశం మారి-మకాం పదిరోజుల వరకు పొడిగించ బడింది. సూరికి హైదరాబాదు అంటే నాలుగవ రోజుకే మొహమెత్తి పోయింది. ఆ బిజీ జీవితం అతనికి నచ్చలేదు మరీ ముఖ్యంగా శారద నారాయణతో పెట్టుకున్న సంబంధం బొత్తిగా నచ్చలేదు.

పదకొండో రోజున శారద సూరి వాళ్ళూరు వచ్చేశారు. వచ్చిన నెలరోజుల తర్వాత నారాయణ మొట్టమొదటిసారిగా వాళ్ళూరు వచ్చాడు. ఆ తర్వాత ప్రతి నెలా వచ్చి మూడు నాలుగు రోజులుండి వెళ్ళిపోతున్నాడు. దరిమిలా వాతావరణంలో ఏదో రవంత మార్పువచ్చినట్లు సూరి గమనించాడు. మార్పుకు కారణం సూరికి అర్థం కాలేదు. నారాయణ తాగి శారదను తన్నుతున్నప్పుడు కూడా సూరి జోక్యం కలిగించుకోలేదు. శారద సూరి సహాయం ఎప్పుడూ అర్థించలేదు.

* * *

గోడగడియారం గంటలు కొట్టటం మొదలు పెట్టింది. సూరి తలెత్తి గడియారం వంకచూశాడు. ఏడయింది. సోఫాలోంచి లేచి స్విచ్ నొక్కాడు ట్యూబ్ లైట్ వెలిగింది. దాహం వేస్తోంది. వంట గదిలోకి నడిచి లైటు వెలిగించాడు. గ్లాసు అందుకుని కూజా లోంచి గ్లాసులోకి నీళ్ళు ఒంపుకుని తాగుతోంటే వెనక గాజుల చప్పుడు వినిపించింది! గ్లాసు కూజా ప్రక్కన పెట్టి వెనక్కి తిరిగి చూశాడు. శారద చేతులు కట్టుకుని గుమ్మానికి ఆనుకుని నిలబడిఉంది. ఒంటిమీద చీరమటుకు చుట్టబడి ఉంది. లోపల మరో ఏ ఆచ్ఛాదనా లేదు. పెదవులు తడిగా ఉన్నాయి.

జుట్టు ముడి వదులుగా ఉంది. కళ్ళు తృప్తితో మెరుస్తున్నాయి.

"నువ్వు వచ్చి ఎంతసేపవుతుంది?" అడిగింది శారద.

"అరగంట అయింది" అన్నాడు సూరి పొడిగా.

"ఇవేళ ట్యూషన్‌కు వెళ్ళలేదా?"

"లేదు పిన్నీ. తల నొప్పిగా ఉంది."

శారద తన క్రింది పెదవిని పయిపంటితో అందుకుని కొరికి వదిలి, "నారాయణ వచ్చాడు...." అంది.

తెలుసన్నట్లు తలూపాడు సూరి.

"సూరీ! ఏమీ అనుకోక పోతే ఆ స్టవ్ వెలిగించి మా కిద్దరికీ వేడి నీళ్ళు పెడుదూ. ఒళ్ళంతా జిడ్డు జిడ్డుగా ఉంది....స్నానం చేస్తేగాని హాయిగా వుండదు" అని సూరి జవాబుకయినా ఎదురు చూడకుండా స్నానాల గదివైపు నడిచింది.

సూరి అయిష్టంగానే స్టవ్ వెలిగించి, స్టవ్‌మీద నీళ్ళు కాగుపెట్టి బయటకు వచ్చాడు. పడకగది దాటుతూ లోపలికి తొంగి చూశాడు. నారాయణ మంచంమీద వెల్లికిలా పడుకుని ఉన్నాడు. అతని చేతిలో సిగరెట్ వెలుగుతోంది.

ఆ రాత్రి భోజనాలు ముగిసే సరికి తొమ్మిదిన్నర అయింది. పావు తక్కువ పదింటికి సూరి పరుపు తీసుకుని బయటకు వచ్చి అరుగుమీద పరుపు పరిచి పడుకున్నాడు. అరగంట తరవాత సూరికి అలా నిద్ర పడుతుండగా పడకగదిలోంచి మాటల యుద్ధం ప్రారంభమయి మరో పది నిముషాల్లో తీవ్రతర మయింది. నారాయణ శారదను కొద్దిసేపు బాది అలసిపోయి వదిలేశాడు. శారద తలుపు తెరచుకుని చీర చుట్టుకుంటూ బయటకు వచ్చింది. ఆమెను చూడగానే సూరి లేచి కూర్చున్నాడు. శారద మెట్లమీద చతికిలబడి ఏడవటం మొదలెట్టింది.

సూరికి ఆమెంటే జాలివేసింది. కాని ఆమెను ఓదార్చటానికి ప్రయత్నించలేదు. ఏమయిందని అడగలేదు. దుఃఖం ముంపు తగ్గాక ఆమే అంది. "దొంగ చచ్చినవాడు కొట్టాడు" అంటూ నారాయణను శాపనార్థాలు పెట్టింది. కొద్దిసేపు మౌనంగా ఉండి చివరకు "వెధవన్నర వెధవ. పెళ్ళి చేసుకుంటాడట....జీతం డబ్బులు ఈ మహాతల్లికి ధారపోయాలట... పెళ్ళి చేసుకుంటే మా నాన్నగారి కుటుంబ పెన్షన్, ఒకటా రెండా? అయిదు వందలు....వీడి తాతగాడి ముల్లె నా దగ్గిర దాచాడా....థూ" అని

కాంగ్రెడించి ఊసింది మరో పది నిమిషాల వరకు నారాయణను తిడుతూ ఉండిపోయింది.

అరగంట తర్వాత నారాయణ బయటకు వచ్చి శారద ప్రక్కన కూర్చుని క్షమాపణలు చెప్పు కున్నాక శారద శాంతించింది. ఈ ప్రవర్తనకు సూరి ఆశ్చర్యం లోంచి తెరుకునే లోగా శారద లేచి నారాయణతో పడక గది లోకి నడిచింది. వెంటనే పడక గది తలుపు మూసుకు పోయింది. కొద్ది సేపయ్యాక పడకగదిలోంచి శారద నవ్వటం వినిపించింది. పడకగదిలో లైటు ఆరిపోయిన రెండుగంటలవరకు సూరికి నిద్ర పట్టలేదు.

ఆ మరునటిరోజు ఉదయం సూరి నిద్ర లేచేసరికి ఎనిమిదిన్నర కావస్తోంది. పరుపు చుట్టి లోపల పడేసి పడక గదిలోకి చూశాడు. పడకగది మంచం ఖాళీగా వుంది. శారద కాని, నారాయణ కాని కని పించలేదు. ముఖం కడుక్కుందుకు స్నానాల గదివైపు వస్తూ వంట గదిలోకి తొంగిచూశాడు. అక్కడా లేరు. 'వీళ్ళు ఏమయ్యారు?' 'ఎక్కడికి వెళ్ళారు?' అని ప్రశ్నించుకుంటూ స్నానం గదిలోకి వచ్చి ముఖం కడుక్కొన్నాడు.

ముఖం కడుక్కుని డైనింగ్ టేబిలుముందు కూర్చుని ఫ్లాస్కు లోంచి కప్పులోకి కాఫీ వంపుకుని తాగుతూ పెరటిలోకి చూశాడు. పెరటికి అవతల గోడకు ఆనుకుని మామిడితోట వుంది. తోటకు కుడి ప్రక్కగా ఖాళీ స్థలం వుంది. ఖాళీ స్థలంలో పాడుబడిపోయిన బావి వుంది. అటు వందగజాల వరకు మరొక ఇల్లు లేదు. శారద మామిడి తోటలోంచి రావటం గమనించిన సూరి ఆశ్చర్యపోయాడు. సామా న్యంగా శారద అటువైపు వెళ్ళదు. కప్పు ఖాళీ చేసేసరికి శారద లోపలికి వచ్చి కుర్చీ లాక్కుని కూర్చుంది. కప్పు అందుకుని కాఫీ ఫ్లాస్కులోంచి పోసుకుంటుంటే ఆమె చేతులు ఒణకటం సూరి గమనించాడు. అంత వేడి వేడిగా కాఫీని ఒక్క గుటకలో తాగి, "నారాయణ కాలు జారి బావిలో పడ్డాడు" అంది.

సూరి ఉలిక్కి పడ్డాడు. "ఎప్పుడు?" అడిగాడు.

"ఇప్పుడే." అంటుంటే శారద కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తన తండ్రి అదే బావిలో ఏడు సంవత్సరాల క్రిందట పడి చని పోయాడన్న విషయం సూరికి హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. *